క్లుప్తంగా

హవల్దార్‌కు జోహార్లు



హవల్దార్ చిత్రపటం వద్ద మాజీ సైనికులు

బొబ్బిలి: జమ్ము కశ్మీర్‌లో పెట్రోలింగ్ చేస్తున్న హవల్దార్ వి సుబ్బయ్య ల్యాండ్‌మైన్‌పై కాలుపెట్టి 30 మంది జవాన్లను ఇటు రావద్దని కాపాడి వీరమరణం పొందిన పరిస్థితిని భరత మాత గుర్తుంచుకుంటుందని మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్‌కిరణ్‌కుమార్ తదితరులు అన్నారు. ఈ మేరకు ఆదివారం సుబ్బయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సైనిక సంక్షేమ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్డిరామకృష్ణ, అలుగోలు గోవిందనాయుడు, ఎస్‌ఆర్‌మోహనరావు, ఎంఎల్ రావు, పి.సురేష్‌బాబు, సీహెచ్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

టెక్కలి: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రతిరోజూ పుస్తకాలు చదవడం ద్వారా మంచి జ్ఞానాన్ని పొందవచ్చని, ఇది విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులంతా చేరాలని, ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి, దినపత్రికలు, కథల పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలు చదవడంపై దృష్టి సారించాలన్నారు.

జనరల్ బోగీలు పెంచాలి

బొబ్బిలి: రైళ్లల్లో ప్రస్తుతం ఉన్న జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వివిధ రైళ్లల్లో సాధారణ ప్రయాణీకులకు సరిపడ జనరల్ బోగీలు లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బాత్‌రూమ్‌ల వద్ద కూడా కూర్చొని, పడుకొని, నిల్చొని కిక్కిరిసి మరీ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి, ప్రయాణీకుల కష్టాలు తీరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బొబ్బిలిలోనే అత్యధిక కేసుల రాజీ

బొబ్బిలి: జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒక్క బొబ్బిలిలోనే అత్యధిక కేసులు రాజీ అయినట్లు సీఐ కె.సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మొత్తం 438 కేసులను రాజీ చేయడం జరిగిందని, వాటిలో 59 ఐపీసీ కేసులు, 379 పెట్టీ కేసులు ఉన్నాయన్నారు. ఈ విషయమై ఎస్పీ వకుల్ జిందాల్ నుంచి అభినందించారన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు కోరారు. పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్‌ఐలు వి.జ్ఞానప్రసాద్, ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపుల ఉన్నతికి కృషి

రాజాం సిటీ: తూర్పుకాపు సామాజిక వర్గం ఉన్నతికి తనవంతు కృషి చేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కంచరాం దగ్గరున్న తృప్తి రిసార్ట్‌లో రాజాం మున్సిపాలిటీ పరిధిలోని తూర్పుకాపుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన.. బీసీ–డిలో ఉన్న తూర్పుకాపులను బీసీ–ఏలో చేర్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. తూర్పుకాపులంతా ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ధనుర్మాసం.. పూజలకు ప్రత్యేకం
- విష్ణుమూర్తికి మహా ప్రీతికరమైన మాసం
- నేటి నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు
- నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు
- ముస్తాబైన ఆలయాలు



రాజాం రాణా వీధిలో పూజలకు ముస్తాబైనవైష్ణవాలయం

ధనుర్మాసంలో..

సకల శుభాలు

రాజాం సిటీ:

ధనుర్మాసం..విష్ణుమూర్తికి మహా ప్రీతికరమైన మాసం. ఇదే మాసంలో అన్ని విష్ణు ఆలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నెల రోజుల పాటు తిరుప్పావై పాశురాలు పఠిస్తారు. అలాగే విష్ణువుని మధుసూదనుడిగా పూజిస్తారు. మొదటి 15 రోజులు చక్కెర పొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు. తర్వాతి 15 రోజులూ దద్ధోజనం నివేదిస్తారు. పెళ్లికాని అమ్మాయిలు ఇంటి ముందు ముగ్గులు, గొబ్బెమ్మలతో పూజలు చేస్తే కోరుకున్న వరుడు లభిస్తాడని ప్రతీతి. ఇదిలా ఉండగా, ఇదే మాసంలోని అన్ని రోజులూ శ్రీకృష్ణపరమాత్ముడికి తులసిమాల సమర్పించే యువతులకు నచ్చిన వరుడితో వివాహం జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

ప్రతి శుక్రవారం కుంకుమార్చనలు..

ఈ నెల 16వ తేదీ నుంచి 2025 జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే సమయంలో ధనుర్మాస వ్రతాలు ఆచరిస్తారు. అన్ని ఆలయాల్లో నిత్యం ఉదయం సుప్రభాతం, మంగళవాయిద్యాలు, తిరుప్పావై గానం, ఆండాళ్ కోవెల సేవ జరుపుతారు. ప్రతి శుక్రవారం గోదాదేవికి కుంకుమార్చనలు చేస్తారు. జనవరి 14వ తేదీన మకర సంక్రాంతి పండగ ప్రత్యేక పూజలు చేపడతారు. దీంతో ఆలయాల్లో పండగ వాతావరణం నెలకొంటుంది. పలు ప్రాంతాల్లోని వైష్ణవ ఆలయాల్లో ఈ ధనుర్మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

ధనుర్మాసం విశిష్టత..

సూర్యభగవానుడు ధనుస్సు రాశిలో ప్రవేశించి, కొంతకాలం ఆ రాశిలో ఉండే కాలాన్ని ధనుర్మాసం అంటారు. మార్గశిర మాసంలోనే ధనుర్మాసం కొనసాగుతుంది. వైష్ణవ సంప్రదాయాల్లో ఈ మాసం అత్యంత పుణ్యదాయకం. ఈ నెల రోజులూ వైష్ణవాలయాల్లో ప్రతిరోజూ వేకువజాము నుంచే విశేష పూజలు నిర్వహిస్తారు. గోదాదేవి తన ఆరాధనను పూలమాలలుగా భావించి, రంగనాధునికి ధరించి మోక్షాన్ని పొందినట్లు పురాణాల ద్వారా తెలియవస్తోంది. ఆమె రాసిన 30 పాశురాలను ధనుర్మాసమంతా వైష్ణవాలయాల్లో పారాయణం చేస్తారు. సూర్యుడు ఉత్తరాయానికి మారే ముందు వచ్చే పుష్యశుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి(ముక్కోటి ఏకాదశి) అంటారు. వైకుంఠ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉన్న విష్ణువు ఏకాదశి రోజున మేల్కొని, ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తాడని పెద్దలు చెబుతున్నారు. అదే రోజున ప్రభాత వేళలో స్వామిని ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకోవడం ముక్తిదాయకమని ప్రసిద్ధి. ఈ మాసమంతా గృహిణులు తమ ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులతో అలంకరణలు చేపట్టడం సంప్రదాయంగా వస్తోంది.

వైష్ణవులకు అత్యంత పవిత్రం

భక్తురాలు గోదాదేవి శ్రీరంగనాధుని స్తుతిస్తూ రోజుకో పాశురాన్ని 30 రోజుల పాటు గానం చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. 30వ రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. పాశురాలు పఠించినా, విన్నా, గోదా కల్యాణం తిలకించినా సకల శుభాలు కలుగుతాయి. 12 మాసాల్లో ధనుర్మాసాన్ని వైష్ణవులు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.

– తిరుమల రంగనాథం, వైష్ణవాచార్య పీఠాధిపతి, వనసలవలస, రేగిడి మండలం

● పొలానికి కాపలాగా టెడ్డీ బేర్



సంతకవిటి మండలంలోని పోతులజగ్గుపేట గ్రామ పొలాల్లో ఓ పొలానికి కాపలాగా టెడ్డీ బేర్‌ను ఏర్పాటు చేశారు. ఇదివరకు పంటలకు దిష్టి తగలకుండా వరిగడ్డితో తయారు చేసిన మనిషి బొమ్మలను దిష్టిబొమ్మలుగా పొలాల్లో ఉంచేవారు. రానురాను రైతులు వినూత్నంగా ఆలోచిస్తూ ఇలా టెడ్డీ బేర్‌లు, తమకు ఇష్టమైన, ట్రెండింగ్‌లో ఉన్న సినీ హీరో, హీరోయిన్ల ఫ్లెక్సీలు ఈ మధ్య కాలంలో ఉంచుతుండడం చూస్తున్నాం. ఏదిఏమైనా అన్నదాత సరికొత్త ఆలోచనకు చూపరులు ఫిదా అవుతున్నారు. – సంతకవిటి

● పగలు ఆరవు.. రాత్రి వెలగవు!



రామభద్రపురం మండలం, తారాపురంలోని వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం వెలుగుతూనే ఉంటున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్ వృథా అవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలు ఆరవు, రాత్రి వెలగవని కూడా పరోక్షంగా విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనమని మండిపడుతున్నారు. విద్యుత్ పొదుపు దినోత్సవం రోజు మాత్రమే విద్యుత్ ఆదా చేయాలని ర్యాలీలు చేయడం కాదని, పర్యవేక్షణ కూడా చేయాలని హితవు పలుకుతున్నారు. – రామభద్రపురం

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పఠన పోటీల విజేతలకు పోటీల అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. 12వ అధ్యాయం శ్లోకాలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల మధ్య ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విభాగాల్లో పోటీలు నిర్వహించామని, ఈ పోటీలకు మొత్తం 170 మంది విద్యార్థులు హాజరైనట్లు వికాస తరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి, ప్రాథమిక విభాగంలో పొగిరి రేణుక(జెడ్పీహెచ్‌ఎస్ పొగిరి), వల్లూరు వంశీకిరణ్ (జెడ్పీహెచ్‌ఎస్ బొద్దూరు), బెహర గాయత్రి(ఎంపీపీఎస్, పోలీస్‌స్టేషన్ రోడ్డు పాఠశాల)లు మొదటి మూడు స్థానాలు సాధించారు. ప్రాథమికోన్నత విభాగంలో కొనపల లోహిత్‌కుమార్(జెడ్పీహెచ్‌ఎస్ బొద్దూరు), పట్నాన పవిత్ర(జెడ్పీహెచ్‌ఎస్ మందరాడ), బెవర నవీన్(జెడ్పీహెచ్‌ఎస్ బొద్దూరు)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, ఉన్నత విభాగంలో వావిలపల్లి సాయితనూజ, వల్లూరు నాగలక్ష్మి(జెడ్పీహెచ్‌ఎస్, బొద్దూరు), పి.సాయిభువన(జెడ్పీహెచ్‌ఎస్, పొగిరి)లు తొలి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి, శిశు విభాగంలో ఎల్.లోహిత చంద్ర(ది సన్ స్కూల్), ఎల్.రిషిక(విశ్వశాంతి విద్యాలయం), పి.తన్మయి(ది సన్ స్కూల్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు.. ప్రాథమిక విభాగంలో ఎ.గాయత్రి(సన్ స్కూల్), పాలవలస జస్విన్‌నాయుడు(డీఏవీ పబ్లిక్ స్కూల్), వి.మోక్షశ్రీ(జ్ఞానజ్యోతి విద్యాలయం)లు తొలి మూడు స్థానాలు.. ప్రాథమికోన్నత విభాగంలో టంకాల శృతి (విశ్వశాంతి విద్యాలయం), ఉప్పల రిత్విక్‌సాయి (విద్యానికేతన్), డి.జ్యోత్స్న(జ్ఞానజ్యోతి)లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఉన్నత విభాగంలో రంప సంధ్య(విశ్వశాంతి), దొర శ్రీనిధి(సన్ స్కూల్), ముద్దన శివశంకర్(జ్ఞానజ్యోతి విద్యాలయం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

సేవాభావం అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక వక్తలు కిమిడి సత్యనారాయణనాయుడు, జడ్డు జగ్గారావు, ఎన్‌వీ రమణలు కోరారు. మండల కేంద్రంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పుణ్యతీర్థాలు, క్షేత్రాలు సత్సంగానికి సాటి రావన్నారు. ఎక్కడైతే సత్సంగం జరుగుతుందో అక్కడ ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. అనంతరం దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు ఆధ్వర్యంలో దత్త పాదుకా పూజ, గణపతి హోమం, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారాలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

బొబ్బిలి: దత్తాత్రేయ జయంతి సందర్భంగా స్థానిక పట్టణంలోని అమ్మిగారి కోనేరు వద్ద రుద్రాభిషేకం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై, స్వామికి పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వితరణ

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయానికి రాజాం ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త మామిడిపాక సాయికృష్ణ, స్రవంతి దంపతులు సీసీ కెమెరాలు, ఎల్‌ఈడీ టీవీ ఆదివారం వితరణ చేశారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరింత మంది ముందుకురావాలని కోరారు.

పంటకోత ప్రయోగం



చెరకును తూకం వేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో సింగంవలస వెంకటరమణ చెరకు పంట పొలంలో ఆదివారం పంటకోత ప్రయోగం చేపట్టారు. 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో చేసిన ఈ ప్రయోగంలో పంటను కటింగ్ చేసి, తూకం వేయగా 305 కిలోల బరువు తూగినట్లు ఎస్‌ఎస్‌వో సురేష్‌కుమార్, ఏఎస్‌వో ఏసుబాబు తెలిపారు.

● ఐక్యతతోనే హక్కుల సాధన



ఐక్యతతోనే కార్మిక హక్కుల సాధన, శ్రమదోపిడీ అరికట్టడం సాధ్యమని సీఐటీయూ పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు అన్నారు. రాజాంలోని విద్యానికేతన్ పాఠశాలలో సీఐటీయూ రాజాం ప్రాంతీయ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఐక్యత–పోరాటం నినాదంతో 1970లో ఏర్పాటైన సీఐటీయూ దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా బలపడిందన్నారు. 1981 నుంచి కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసి, దేశ వ్యాప్తంగా 19 సమ్మెలు చేపట్టిన చరిత్ర సీఐటీయూకే దక్కుతుందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడే ప్రభుత్వాలపై సీఐటీయూ పోరు ఎప్పుడూ ఉంటుందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్, ఎ.జగన్మోహనరావు, బి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు. – రాజాం

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



రాజాం సిటీ: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు



బొబ్బిలిరూరల్: పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రవికుమార్ తదితరులు

వాడవాడలా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ప్రశంసించారు. విద్యార్థులు, యువత అంతా ఆయన జీవితచరిత్రను చదివి తెలుసుకోవాలన్నారు. ఆయన కృతనిశ్చయం, పట్టుదలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



బొబ్బిలి: అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి తదితరులు



టెక్కలి శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిలో ఎంఈవో-2 పాపారావు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి

ముమ్మరంగా వాహన తనిఖీలు



రామభద్రపురం: వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ జ్ఞానప్రసాద్

వంగర: మండల వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎస్‌ఐ షేక్‌శంకర్ తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులంతా తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

రామభద్రపురం: మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తన సిబ్బందితో కలిసి వాహనదారులను ఆపి, వాహనాల ధ్రువపత్రాలు, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించి, సూచనలు చేశారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

సంక్షిప్తంగా..

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి చర్యలు



రాజాం-రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎం.ఆర్.అగ్రహారం-ఉత్తరావల్లి మధ్య జరుగుతున్న తారురోడ్డు పనులు

టెక్కలి: రాజాం–రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో టెక్కలి, మెరకముడిదాం మండలాల మధ్య ఉన్న ఎం.ఆర్.అగ్రహారం–ఉత్తరావల్లి గ్రామాల మధ్య ఎట్టకేలకు తారురోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డంతా పూర్తిగా గోతులమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగేది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రజలు, వాహన చోదకులు నానా అవస్థలు పడేవారు. కొన్నిసార్లు వాహనాలు రోడ్డు మధ్య గోతుల్లో కూరుకుపోవడం, కొన్నిసార్లు వాహనాలు తిరగబడిపోవడంతో గంటల తరబడి వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. గుంతలను పూడ్చేందుకు నిధులు మంజూరు చేయడంతో అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట మలుపు వద్ద రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.70 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం కొమెరలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, బెవర రాంబాబు, కడగల నాగరాజు, పాలవలస రామచంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు మద్యం విక్రయిస్తే చర్యలు



మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బొబ్బిలి: నిర్దేశిత ధర కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు హెచ్చరించారు. బొబ్బిలిలో ధరలు తగ్గిన మద్యంబాటిళ్లను కూడా పాతధరలకే(ఎక్కువ ధర) విక్రయిస్తున్నందున ఆదివారం సాక్షి దినపత్రికలో 'తగ్గేదేలే' శీర్షిక పేరిట వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన సదరు సీఐ.. నియోజకవర్గంలోని పలు మద్యం దుకాణాలను ఆదివారం పరిశీలించి, అక్కడి స్టాకు, విక్రయిస్తున్న మద్యంసీసాల ధరలను గమనించి, పలు సూచనలు చేశారు. అనంతరం ధరల పట్టికను ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నారు. అందరూ ఎంఆర్‌పీ ధరకే మద్యం అమ్మాలన్నారు.

వాసవీమాతకు సారె సమర్పణ



అమ్మవారికి చీర, సారె సమర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వాసవీ క్లబ్ మనరాజాం–సారధి సభ్యులు ఆదివారం సారె, చీరలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమానికి వెయ్యి రోజులు దాటిన సందర్భం పురస్కరించుకుని, అమ్మవారికి సారె సమర్పించామని సభ్యులు తెలిపారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షులు కొత్తా రత్నకుమారి, వాసవీక్లబ్ సభ్యులు జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ల వద్ద పంచాయతీల సుస్థిరాభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలకు రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పంచాయతీల సుస్థిరాభివృద్ధి, వాటి లక్ష్యాలపై రెండు బ్యాచ్‌లకు విడివిడిగా ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.